ఓటరు జాబితా విడుదల

పాన్‌గల్: స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన ఓటరు జాబితా ముసాదాను శుక్రవారం మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామ పంచాయతీల్లో ప్రదర్శించినట్లు ఎంపీడీఓ గోవింద్‌రావు తెలిపారు. మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో 256 వార్డుల్లో పురుషులు 21,100, స్త్రీలు 20,366, ఇతరులు 01 కలిపి మొత్తం 41,467 మంది ఓటర్లు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు ఒకే వార్డులో ఉండే విధంగా ఓటరు జాబితాను సరిదిద్దినట్లు ఆయన పేర్కొన్నారు. ఓటరు జాబితాలో ఏమైనా పొరపాట్లు ఉంటే పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లి సరిచేసుకోవాలన్నారు. డీటీ అశోక్‌నాయుడు దావాత్‌ఖాన్‌పల్లి పంచాయతీలో ఓటరు జాబితాను ప్రదర్శించారు.

వనపర్తి రూరల్: ఎంపీడీఓ కార్యాలయం, గ్రామ గ్రామపంచాయతీల వద్ద ఓటరు జాబితాలను ప్రదర్శించామని ఎంపీడీఓ రాఘవ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాను సరిచూసుకొని, తప్పులుంటే ఈ నెల 21 వరకు అభ్యంతరాలను పంచాయతీ కార్యదర్శికి అందజేయాలని సూచించారు. తుది జాబితాను 28న ప్రకటిస్తామన్నారు.

మదనాపురం: తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం తహసీల్దార్ అబ్రహంలింకన్ మండల స్థాయి రాజకీయ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయా రాజకీయ పార్టీల తరఫున నాగన్న, యాదగిరి, రామకృష్ణారెడ్డి, వెంకట్రాములు పాల్గొనగా.. ఓటర్ జాబితా సవరణలో భాగంగా కొత్త ఓటర్ నమోదు, తొలగింపులకు సంబంధించి అన్ని గ్రామాల్లో ప్రజలకు అవగాహన కలిగించాలని తహసీల్దార్ సూచించారు.


ఆత్మకూర్‌లో ఓటరు జాబితా ముసాయిదాను విడుదల చేస్తున్న ప్రత్యేకాధికారి బీరం సుబ్బారెడ్డి

చిన్నంబావి: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేశారు. ఈ సందర్భంగా మండలంలోని వెలగొండలో ఎంపీడీఓ రమణరావు, మండల ప్రత్యేకాధికారులు ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేశారు. అదేవిధంగా ఓటరు జాబితాపై 14వ తేదీ నుంచి 21 తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరించనున్నట్లు తెలిపారు. గ్రామ స్థాయిలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే పంచాయతీ కార్యదర్శికి రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలన్నారు.

వీపనగండ్ల: మండలంలోని 14 గ్రామ పంచాయతీల ఓటర్ జాబితాలను విడుదల చేశామని, జాబితాలో ఎలాంటి తప్పులు దొర్లిన అధికారులు దృష్టికి తీసుకురావాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మండలంలో మొత్తం 23,279 మంది ఓటర్లు ఉండగా.. 11,728 మంది పురుషులు, 11,550 మంది స్త్రీ ఓటర్లు ఉన్నారని వెల్లడించారు. అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాలతో పాటు ఎంపీడీఓ కార్యాలయంలో కూడా ఓటర్ జాబితాలు అందుబాటులో ఉంటాయన్నారు.

ఆత్మకూర్: 18 ఏళ్లు నిండిన వారందరికీ ఓటు హక్కు నమోదు చేయించాలని, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటరు జాబితా సవరణలు ఉంటే దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి సురేష్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఓటరు జాబితాను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుజాత, ఎంపీఓ శ్రీరాంరెడ్డి, కార్యదర్శులు, బీఎల్‌ఓలు ఉన్నారు.


వీపనగండ్ల ఎంపీడీఓ కార్యాలయంలో..


దావాత్‌ఖాన్‌పల్లిలో..


వనపర్తిలో..

క్లుప్తంగా

బీజేపీ బలోపేతానికి కృషి



ఆత్మకూర్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో దేశాభివృద్ధి పరుగులు పెడుతుందని, బీజేపీలో సభ్యత్వాలు తీసుకుని పార్టీని మరింత బలోపేతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్‌జీ, బీజేవైఎం రాష్ట్రకార్యదర్శి మేర్వరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని గ్రామాల్లో కార్యకర్తలతో బీజేపీ నాయకుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో విష్ణువర్ధన్‌రెడ్డి, ఎల్లన్న, అంజనేయులు, కంభాళాపురం రాము, శ్రీనివాసులు, నాగరాజు, బాలరాజు, భరత్, నవీన్, మహేష్, దశరథ కుర్మన్న, నాగరాజు, శివ ఉన్నారు.

వైన్‌షాప్‌ను తరలించాలని సంతకాల సేకరణ



అమరచింత: పట్టణంలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న వైన్‌షాప్‌ను శివారులోకి తరలించాలంటూ కేవీపీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ఈ శ్యాంసుందర్ మాట్లాడుతూ నిత్యం ఆత్మకూర్, మరికల్, గద్వాలకు వెళ్లే ప్రజలు ప్రధాన రహదారిపై ప్రయాణిస్తుంటారని, రోడ్డు పక్కనే వైన్ షాపు ఉండటంతో ద్విచక్ర వాహనాలను రోడ్డుపై నిలుపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఉన్న మాదిరిగానే ఊరి చివరన వైన్‌షాపును ఏర్పాటు చేసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అజయ్, విజయ్, మోష, లింగన్న, యశోద, సుమిత్ర, మన్యం తదితరులు పాల్గొన్నారు.

డప్పు కళాకారులకు ఆసరా పింఛన్ ఇవ్వాలి

ఖిల్లాఘనపురం: డప్పు కళాకారులకు ప్రభుత్వం నెలకు రూ.3 వేల ఆసరా పింఛన్ ఇవ్వాలని తెలంగాణ డప్పుకళాకారుల సంఘం మండల అధ్యక్షుడు మల్లగల్ల అశోక్, ఉపాధ్యక్షుడు మొల్గర కుర్మయ్య, ప్రధాన కార్యదర్శి బుగ్గని రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం వారి సమస్యల పరిష్కారం కోసం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు డప్పులు కొడుతూ ర్యాలీగా వెళ్లారు. అనంతరం తహసీల్దార్ పాండునాయక్‌ను కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు అంజనేయులు, లక్ష్మణ్, పానుగంటి నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్‌ఐకి సన్మానం



కొత్తకోట రూరల్: కొత్తకోట పోలీస్ స్టేషన్‌లో 2018 నుంచి ఏఎస్‌ఐగా విధులు నిర్వహించిన ఏఎస్‌ఐ సాగర్ మహబూబ్‌నగర్ జిల్లాలోని భూత్పూర్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. సుదీర్ఘ కాలం పనిచేసిన ఏఎస్‌ఐ సాగర్‌ను శుక్రవారం వివిధ పార్టీలకు చెందిన వారు పూలమాలు వేసి శాలువాలతో ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఆరేళ్ల పాటు కొత్తకోట పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించిన ఏఎస్‌ఐ సాగర్ విధి నిర్వహణలో నిబద్ధతతో ఉండే వారని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో బోయేజ్, మేస్త్రీ శ్రీనివాసులు, సంద వెంకటేష్, శ్యామ్, రాములుయాదవ్, భీమన్ననాయుడు, పీఏసీఎస్ డైరెక్టర్ భాస్కర్, లాల్‌కోట రవి తదితరులు ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు..



వనపర్తి రూరల్: పెబ్బేరు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర స్థాయిలో అవార్డు అందుకున్న ఉపాధ్యాయుడు శంకర్‌గౌడ్, జిల్లా స్థాయిలో అరుంధతి, దుర్గాప్రసాద్‌లను బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్‌గౌడ్ శాలువా, పూలమాలతో సన్మానించారు.

సీసీ కెమెరాల దాతకు..



పాన్‌గల్: మండలంలోని మాందాపూర్, బుసిరెడ్డిపల్లి రహదారిపై 8 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్న బుసిరెడ్డిపల్లి నివాసి సాంబశివుడును శుక్రవారం ఎస్‌ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ సీసీ కెమెరాల అవశ్యకతపై అవగాహన కల్పించగా వెంటనే స్పందించిన హోటల్ నిర్వాహకుడు సాంబశివుడు రూ.40 వేలతో 8 కెమెరాలను ఏర్పాటుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హెచ్‌సీ యాదగిరి, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసికోల్లాసం


కొత్తకోటలో పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో డీఈఓ గోవిందరాజులు

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం ప్రారంభమైన ఎస్‌జీఎఫ్ మండల స్థాయి ఆటల పోటీలు శుక్రవారం కొనసాగాయి. ఈ పోటీల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. వాలీబాల్ బాలుర విభాగంలో రాజబహదూర్ వెంకట్రామిరెడ్డి ఉన్నత పాఠశాల, బాలికల విభాగంలో జెడ్పీహెచ్‌ఎస్ అమడబాకుల, కబడ్డీ బాలుర విభాగంలో అమడబాకుల మోడల్ స్కూల్, బాలికల విభాగంలో రాజబహదూర్ వెంకట్రామిరెడ్డి ఉన్నత పాఠశాల, ఖోఖో బాలుర విభాగంలో ఎస్సీ గురుకుల (వీపనగండ్ల), బాలికల విభాగంలో రాజబహదూర్ వెంకట్రామిరెడ్డి ఉన్నత పాఠశాల విద్యార్థులు మొదటి బహుమతులు సాధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు జిల్లా విద్యాధికారి గోవిందరాజులు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ కృష్ణయ్య, నోడల్ ఆఫీసర్ యుగంధర్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, పీఆర్‌టీయూ ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

అమరచింత: పాఠశాల స్థాయిలో నిర్వహించే క్రీడల్లో విద్యార్థులు రాణించి జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని పట్టణానికి కీర్తిప్రతిష్ఠతలు తీసుకురావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ అన్నారు. జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల మైదానంలో శుక్రవారం ఎస్‌జీఎఫ్ మండల స్థాయి పోటీలను నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి 180 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ భాస్కర్‌సింగ్, హెచ్‌ఎం కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

వనపర్తి రూరల్: వనపర్తి పట్టణంలో బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, మాజీ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, మండల నాయకులను గురువారం అర్ధరాత్రి పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా గట్టుయాదవ్, వాకిటి శ్రీధర్ మాట్లాడుతూ అక్రమ అరెస్టులు చేయించడం సరికాదని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నాగన్న యాదవ్, కంచెరవి, నందిమల్ల అశోక్, ప్రేమ్‌నాథ్ రెడ్డి, స్టార్ రహీమ్, రఘువర్ధన్‌రెడ్డి, విజయకుమార్ తదితరులు ఉన్నారు.

శ్రీరంగాపురంలో..

శ్రీరంగాపురం, పెబ్బేరు మండలంలోని సింగిల్ విండో చైర్మన్ జగన్నాథంనాయుడు, బీఆర్‌ఎస్ నాయకులు పృథ్వీరాజు, వెంకటస్వామి, సత్యం యాదవ్, ఎల్లస్వామి, పరశురాముడు, పర్వతాలు, కృష్ణకుమార్, రాఘవేందర్‌ను గురువారం అర్ధరాత్రి పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. **కొత్తకోట రూరల్:** పీఏసీ కమిటీ చైర్మన్‌గా అరెకపూడి గాంధీని నియమించడాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇద్దరు ఎమ్మెల్యేల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. బీఆర్‌ఎస్ పార్టీ పిలుపు మేరకు శుక్రవారం కొత్తకోట బీఆర్‌ఎస్ నాయకులు హైదరాబాద్ వెళ్తున్నారనే సమాచారం తెలుసుకున్న స్థానిక ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి వారిని ముందస్తు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో పీఏసీఎస్ డైరెక్టర్ నందమల్ల భాస్కర్, కౌన్సిలర్ తిరుపతయ్య, కో ఆప్షన్ సభ్యులు వసీంఖాన్, బీఆర్‌ఎస్‌వీ నాయకులు కిరణ్, వికాస్ ఉన్నారు.


కొత్తకోట పోలీస్ స్టేషన్‌లో అరెస్టయిన బీఆర్‌ఎస్ నాయకులు

వీపనగండ్ల: శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ నాయకులను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నట్లు ఏఎస్‌ఐ చంద్రారెడ్డి తెలిపారు. హైదరాబాద్ పట్టణంలో బీఆర్‌ఎస్ నాయకులు తలపెట్టిన నిరసన కార్యక్రమాలకు మద్దతు తెలిపేందుకు వెళ్లే క్రమంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగే పరిస్థితులు నెలకొంటాయని, అందులో భాగంగానే ముంత శివ యాదవ్, సాయిబాబా తదితరులను అదుపులోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ బీరయ్య పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి సిద్ధాంతాలు ఆచరిద్దాం

సాక్షి, నెట్‌వర్క్: సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారం ఏచూరి నమ్మిన సిద్ధాంతం కోసం జీవితాంతం కట్టుబడి ఉన్నారని సీపీఎం, సీపీఐ, మాస్‌లైన్ నాయకులు అన్నారు. ఏచూరి మృతి చెందడంతో జిల్లావ్యాప్తంగా సీపీఎం, సీపీఐ నాయకులు సంతాప కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆది, సీపీఎం మండల కార్యదర్శి బాల్‌రెడ్డి, సీపీఎం జిల్ల కార్యవర్గ సభ్యుడు ఆంజనేయులు, శ్యాంసుందర్, భాస్కర్, అబ్రహం, జీఎస్‌గోపి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్, బాలయ్య, ఎండీ ఖాజా, భాస్కర్, మహమూద్, రాజు, శ్రీహరి, ప్రసాద్, రాబర్ట్, సీఎన్‌శెట్టి, లక్ష్మీనారాయణశెట్టి తదితరులు పాల్గొన్నారు.


వీపనగండ్లలో సీతారాంఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఆస్పత్రుల తనిఖీ

వనపర్తి రూరల్: పెబ్బేరు పట్టణంలో భవిత ల్యాబ్, రాఘవేంద్ర, లక్ష్మీమహదేవ ఆస్పత్రులను జిల్లా డిప్యూటీ వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీనివాసులు శుక్రవారం తనిఖీ చేశారు. మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న అద్వైత్ ఆస్పత్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రుల్లో గర్భిణులకు సాధారణ కాన్పులు చేసేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాస్ మీడియా అధికారి చంద్రయ్య, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.


అద్వైత్ ఆస్పత్రిని పరిశీలిస్తున్న డిప్యూటీ వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీనివాసులు

సంక్షేమ బోర్డు కొనసాగించాలి

అమరచింత: భవన నిర్మాణ రంగ కార్మికుల ఇన్సూరెన్స్ అమలును సంక్షేమ బోర్డు ద్వారానే కొనసాగించాలని తెలంగాణ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ అన్నారు. మండలంలోని సింగంపేటలో శుక్రవారం భవన నిర్మాణ కార్మికులతో సమావేశమై, కరపత్రాలను పంపిణీ చేశారు. సమావేశంలో ఆంజనేయులు, రమేష్, బాలేశ్వర్, వినోద్, కురుమూర్తి, అంజన్న తదితరులు పాల్గొన్నారు.

కేఎల్‌ఐ కాల్వలో షీల్టు తొలగింపు

పాన్‌గల్: మండలంలోని వివిధ గ్రామాల శివారుల్లో ప్రవహిస్తున్న కేఎల్‌ఐ కాల్వలో పేరుకపోయిన షీల్టు తొలగింపు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. కాల్వలో షీల్టు పేరుకుపోవడంతో చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదని, మరికొన్ని గ్రామాల్లో కాల్వలపై నీరు ఎక్కిపారుతుందనే విషయాలను స్థానిక రైతులు, కాంగ్రెస్ నాయకులు మంత్రి జూపల్లి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన సాగునీటి కాల్వల్లో షిల్ట్‌ను వేగంగా తొలగించాలని సాగునీటి అధికారులను ఆదేశించడంతో పనులు ప్రారంభించారు.

జ్వరంతో యువకుడి మృతి

ఆత్మకూర్: జ్వరంతో బాధపడుతున్న ఓ యువకుడు మృతి చెందిన ఘటన శుక్రవారం ఆత్మకూర్‌లో చోటు చేసుకుంది. స్థానిక జాతర మైదానం ప్రాంతానికి చెందిన రేవల్లి వెంకటేష్ (26) మూడు రోజులుగా టైఫాయిడ్‌తో బాధపడుతున్నాడు. గురువారం తీవ్ర అస్వస్థకు గురికావడంతో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స నిర్వహించి, మెరుగైన వైద్యం కోసం కొత్తకోటకు తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు.

వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన

అమరచింత: వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ పట్టణ ముస్లిం కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం పవిత్ర నమాజు అనంతరం మసీదు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తమ మొబైల్ ఫోన్ల నుంచి ఎస్ఎంఎస్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈసందర్భంగా మసీదు కమిటీ అధ్యక్షుడు అయూబ్ ఖాన్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లుతో ముస్లిం మైనారీలకు నష్టం జరుగుతుందన్నారు. ఇలాంటి బిల్లుతో మదర్సాలు, శ్మశాన వాటికలు, మసీదుల, దర్గాలకు సంబంధించిన భూములు, పీర్ల మసీదులకు సంబంధించిన భూములను ప్రభుత్వం తమ ఆధీనంలోకి తీసుకుంటుందని ఆరోపించారు. కార్యక్రమంలో తౌఫిక్, నిస్సార్, షంషీర్, ఆషూ, పాషా, ఖాసీం, మొయిన్, దస్తగీర్, నజీర్, మైనద్దీన్, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవమ్మకు నివాళి

వనపర్తి రూరల్: లక్ష్మీదేవమ్మ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందడంతో సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో విప్లవ జోహర్లు అర్పిస్తూ.. ఆమె చిత్రపటానికి సీపీఎం జిల్లా, రాష్ట్ర నాయకులు పుట్ట ఆంజనేయులు, మండ్ల రాజు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉమ, సాయిలీల, మహేష్, సుగుణమ్మ, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై శ్రద్ధ

పాన్‌గల్: ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం తప్పక రావాలని మండల నోడల్ ఆఫీసర్ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండలంలోని అన్నారంతండా ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించి విద్యార్థి, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లు, ఎఫ్ఎల్ఎన్ బేస్‌లైన్ టెస్టు వివరాలు, విద్యార్థుల సామర్థ్యాలను, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బిచ్యానాయక్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

చెరువులోకి రైస్‌మిల్లు వ్యర్థ జలాలు

వీపనగండ్ల: మండలంలోని పుల్గర్‌చర్ల కొత్త చెరువులోకి శ్రీరంగాపురం గ్రామ శివారులో నెలకొల్పిన బాయిల్డ్ రైస్ మిల్ ద్వారా వస్తున్న వ్యర్థ పదార్థాలతో చెరువు నీరు కలిషితమై అవస్థలు పడుతున్నామని పుల్గర్‌చర్ల గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. శుక్రవారం ఇరిగేషన్, పంచాయతీరాజ్ అధికారులను గ్రామంలోకి పిలిపించి కలుషితం అవుతున్న చెరువు నీటితో పాటు అనారోగ్యానికి గురైన పశువులను అధికారులకు చూపించారు. చెరువు నీరు కలుషితం కావడంతో పాటు సమీపంలోని బత్తుల మల్లయ్య వరి పొలం కుళ్లిపోయిందని, గురుక జమ్ములయ్యకు చెందిన మూడు కోడె దూడలు చెరువు నీటిలో శుభ్రం చేయడంతో అవి అనారోగ్యానికి గురయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై మిల్లు యజమానిని వివరణ కోరగా.. మిల్లు ద్వారా వెలువడుతున్న నీరు వల్ల ఎలాంటి అనర్థాలు జరుగవని, నీటిని నిల్వ ఉంచుకునేందుకు అవసరమైన సెప్టిక్ గుంతలను ఏర్పాటు చేసుకున్నానని తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల సెప్టిక్ గుంతలు నిండి నీరు వాగులో కలిసిందన్నారు. రైతులకు జరిగిన నష్టంతో పాటు కలుషితం అయిన నీటిని శుభ్రం చేయించేందుకు అవసరం అయిన వసతులను ఏర్పాటు చేస్తానని మిల్లు యజమాని వహిదూద్దీన్ తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రసన్న రాణి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, మాజీ ఉప సర్పంచ్ నరేష్, గ్రామస్తులు కురుమయ్య, విజయ్ కుమార్, జగదీశ్వర్, రాజు, గోవిందు, మల్లయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


రైస్‌మిల్లు సమీపంలో వ్యర్థాలను పరిశీలిస్తున్న అధికారులు

ఆక్రమణలు తొలగించాలి

వనపర్తిటౌన్: చెరువులను ఆక్రమించి అమాయక ప్రజలకు ప్లాట్లు అమ్మిన రియల్‌ఎస్టేట్ వ్యాపారులను, అందుకు అనుమతులు ఇచ్చిన అధికారులను, ఆక్రమణల్లో హస్తం కలిగిన ప్రతి ఒక్కరిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని నల్ల చెరువు, తాళ చెరువు, మర్రికుంట చెరువు పరిధిలోని ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలోని నిర్మాణాలను ఆయన పరిశీలించారు. వనపర్తిలో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఉన్న అక్రమ నిర్మాణాలను కూల్చివేయటం ప్రారంభించాలని, ఇళ్లు, ప్లాట్‌లు కోల్పోతున్న పేదలకు ప్రత్యామ్నాయం చూపాలని కోరారు. కార్యక్రమంలో రాఘవేందర్ గౌడ్, అంజన్న యాదవ్, మహిందర్, మ్యాదరి రాజు, శివగౌడ్ పాల్గొన్నారు.


చెరువును పరిశీలిస్తున్న రాచాల యుగంధర్‌గౌడ్

ఎస్ఈ కార్యాలయం ఎదుట ధర్నా

వనపర్తిటౌన్: 30 ఏళ్లుగా ఉద్యోగంలో కొనసాగుతున్న ఉద్యోగ మెరిట్ కం రోస్టర్ సీనియార్టీ విధానం, పదోన్నతుల తర్వాతే కాన్సీక్వేన్షియల్ సీనియార్టీ కొనసాగించాలని విద్యుత్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల జేఏసీ వనపర్తి సర్కిల్ అధ్యక్షుడు పుల్యానాయక్, ప్రధాన కార్యదర్శి దయానందం డిమాండ్ చేశారు. శుక్రవారం వారు ఎస్ఈ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యుత్ శాఖలో పని చేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తామన్నారు. ప్రమోషన్‌లలో ఆర్వోఆర్‌కు కట్టుబడి ఉండాలన్నారు. మెరిట్ ర్యాంకింగ్ ఆదేశాలను ఉపసంహరించుకొని మెరిట్ ర్యాంకింగ్‌కు సంబంధించిన ఆదేశాలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 20 వరకు వివిధ రూపాల్లో ఉద్యమ కార్యాచరణ చేపడతామన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు కేబీ శ్రీనివాసులు, నరసింహ, వెంకట్‌స్వామి, నాగేశ్వన్న పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ నాయకులు

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త అవసరం


వనపర్తి మండలంలోని కిష్టగిరిలో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఆర్‌డీఓ పద్మావతి


పాన్‌గల్ మండలం కదిరెపాడులో..

వనపర్తి రూరల్: సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల ప్రతేకాధికారి ఆర్‌డీఓ పద్మావతి అన్నారు. శుక్రవారం డ్రై డే లో భాగంగా ఆమె మండలంలోని కిష్టగిరిలో పర్యటించారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని ప్రజలకు సూచించారు. గ్రామంలో నీరు నిలిచిన ప్రదేశాల్లో టెమిఫాస్ పిచికారీ చేయడంతో పాటు అయిల్ బాల్స్ వేసినట్లు పేర్కొన్నారు. అనంతరం గ్రామంలోని పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాఘవ, కార్యదర్శి తులసి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, టీచర్లు, ఏఎన్‌ఎం, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: దోమల నివారణతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే రోగాలకు దూరంగా ఉండవచ్చని పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. ఫ్రైడే డ్రైడేలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో వైద్య సిబ్బందితో కాలనీల్లో పర్యటించి వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, నిల్వ నీటిని పారబోసి నూతన నీటిని పట్టుకోవడంతో రోగాలకు దూరంగా ఉండవచ్చన్నారు. దీంతో పాటు జ్వర పీడిత అనుమానితుల నుంచి రక్తనమూనాలను సేకరించారు. మండలంలోని కదిరెపాడులో వైద్య సిబ్బంది ఏఎన్‌ఎం సుమిత్ర ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు.

చిన్నంబావి: ప్రజలు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ రమణరావు అన్నారు. ఆయన దగడపల్లి, మియాపూర్, వెలగొండ గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా దోమల వ్యాప్తి అధికంగా ఉండడం ద్వారా ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదముందన్నారు.

ఆత్మకూర్: సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని, పరిసరాల శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని మండల ప్రత్యేకాధికారి బీరం సుబ్బారెడ్డి, తహసీల్దార్ రాజు, ఎంపీడీఓ సుజాత, ఎంపీఓ శ్రీరాంరెడ్డి అన్నారు. మండలంలోని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టారు.

దోమలతో అప్రమత్తం

పట్టణంలోని 5వ వార్డులో కౌన్సిలర్ పోషన్న ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు, స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అమరచింత: పరిసరాలు పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటామని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ అన్నారు. పట్టణంలోని మూడో వార్డులోని ప్రభుత్వ పాఠశాల రహదారిలో పర్యటించి ఏపుగా పెరిగిన గడ్డి పొదలను తొలగించి, తాగునీటి ట్యాంకు వద్ద పారిశుద్ధ్య పనులు చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నురుల్‌నదీం, ఆరోగ్య శాఖ, మెప్మా, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల అందజేత

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లి ఉన్నత పాఠశాలలో క్లాస్‌మేట్ క్లబ్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం హిందీ దివస్ కార్యక్రమాన్ని మండల నోడల్ ఆఫీసర్, పాఠశాల జీహెచ్‌ఎం శ్రీనివాసులు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసీదాస్, కబీర్‌దాస్ చిత్రపటాలకు నివాళులర్పించి, హిందీ భాష గొప్పతనం తెలిపే సందేశాలతో పాటు చక్కని సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. దీంతో పాటు హిందీ భాషలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు తరగతుల వారీగా బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు శివలీల, విజయలక్ష్మి, సత్యనారాయణ గౌడ్, ఆంజనేయులు, శ్యాం ప్రసాద్, ధ్రువకుమార్, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.


కేతేపల్లిలో హిందీ దివస్ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

మదనాపురం: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల, అజ్జకొల్లు జిల్లా పరిషత్ పాఠశాలలో జాతీయ హిందీ దినోత్సవ కార్యక్రమానికి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మద్దిలేటి విద్యార్థులకు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. చిత్రలేఖనం, పాటలు, నృత్యం, ఉపన్యాసములో పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అజ్జకొల్లు హెచ్‌ఎం షేక్ ఫరూక్‌హుస్సేన్,